


పొలాల్లో ఏనుగుల హల్ చల్

ప్రజాశక్తి -భామిని

భామిని పరిసర గ్రామాలైన గజపతి నగరం, మూలగూడ, కాజీ పురం, సన్నాయి కాలనీలో గత మూడు రోజులుగా హల్ చల్ చేస్తున్నాయి. శనివారం రాత్రి భామిని గ్రామానికి చెందిన లింగిడి గోవింద ఇంటి అవసరాల నిమ్మితం తరలించడానికి రోడ్డు పక్కన నిల్వచేసిన 30 బస్తాలు ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. ఆదివారం సాయంత్రానికి భామినికి చెందిన గురిబిల్లి లక్ష్మీపతికి చెందిన చెరకు తోటలో 4 ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రస్తుతం 4 ఏనుగులు భామిని సమీపంలో ఉండడం, న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా యువకులు కవ్వింపు చేష్టలు చేస్తే, ఏనుగులు దాడి చేసే అవకాశం వుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఎన్నెన్నో ఆశలతో..

- కొత్త ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలతో సరికొత్త సంవత్సరంలోకి
- వేడుకగా నూతన సంవత్సర సంబరాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిర్రున తిరిగే కాలచక్రంలో 2023వ సంవత్సరం చరిత్ర పుటల్లోకి వెళ్లిపోయింది. 2024వ సంవత్సరం కొన్ని గంటల మునుపే రానే వచ్చేసింది. గడిచిపోయిన సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ... 2024వ ఏడుకు స్వాగతం పలుకుతూ జనం ఒకింత ఉత్సాహంతో కేరింతల నడుమ కేకులు కట్ చేస్తున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఈ ఏడాదంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పరస్పర పలకరింపులు, వాట్సాప్ మెసేజ్‌లు ఆదివారం అర్ధరాత్రి నుంచే మొదలయ్యాయి. ఇదంతా షరా మామూలే. ఈ కేక్ కటింగులు, పలకరింపులు కేరింతలు, నూతన సంవత్సర వేడుకలు ఎప్పుడూ జరుగుతున్నవే. కానీ, ఈ ఏడాది నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ముఖ్యంగా శాఖల్లో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లు బరువెక్కిన గుండెలతో అడుగు పెడుతున్నారు. మునుపెన్నడూ లేనంతగా పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు సతమతమౌతున్నారు. రైతులు పుట్టెడు దు:ఖంతో ఉన్నారు. గతేడాది జిల్లాలో తీవ్ర వర్షాభావంతో కొంతమంది, మిచౌంగ్ తుపానుతో కురిసిన భారీ వర్షాలతో మరికొంతమంది రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వ విధానాలతో పలు రకాల వ్యాపారులు, వృత్తిదారులు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలోనైనా తమ సమస్యలు పరిష్కారం కావాలని ఉద్యోగులు, ప్రకృతి కరుణించాలని, ఇప్పటికే జరిగిన నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ఇక సగటు ప్రజానీకం పెరిగిన ధరలు తగ్గించాలని, రోజూ పనులు దొరకాలని ఆరాటపడుతున్నారు. ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాకపోయినప్పటికీ నూతన సంవత్సరంలోకి అడుగితున్న వేళ ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఆశలు, ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలు మనసులు మెదలడం సహజమే. ఎదుగుదలకు, ఆలోచనలకు ఆటకంగా మారుతున్న అలవాట్లను వదిలించుకోవాలని భావించేవారు కొందరైతే, కొత్త విధానాలు అమలు చేసుకుని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొంచుకోవాలనే వారు మరికొందరు. సాదాసీదాగా సాగి పోతున్న జీవితంలో నూతన సంవత్సరం కొత్త జోష్ నింపాలని కొందరు కోరుకుంటారు. ఈ మాటకొస్తే... కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామనే ఆలోచనలు కుర్రకారు నుంచి వృద్ధుల దాకా ఒకింత నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. వారం పది రోజుల ముందు నుంచే నూతన సంవత్సరంలో ప్రారంభించబోయే పనులు, లక్ష్యాల గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించుకుంటారు. ఐతే గతంతో పోలిస్తే నూతన సంవత్సర వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పదేళ్ల క్రితానికి వెళ్లే గ్రీటింగు, టెలీఫోన్ సమాచారాల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకునేవారు. అంతకు మునుపు వారం రోజుల ముందు నుంచే గ్రీటింగుల పంపే క్రమంలో పోస్టాఫీసులు కిటకిటలాడేవి. ఈ ఇప్పుడా పరిస్థితి లేదు. సప్తసముద్రాలు దాటివున్నవారు కూడా కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్ ద్వారా వీడియో కాన్ఫరెన్సు కలుసుకునే పరిస్థితి కొన్నేళ్ల కిందటే వచ్చేసింది. ఇప్పుడు మరింతగా పెరిగింది. ఇక అతిథులను, పెద్దలను కలుసుకునే క్రమంలో పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు అందజేసుకోవడం ఆనవాయితీగా సాగుతోంది. కేక్ కటింగ్ షరా మామూలే. ఈ క్రమంలో పండ్లు, స్వీటు దుకాణాలు, బేకరీలు, రంగులు విక్రయించే షాపులు ఆదివారం ఉదయం నుంచే సందడిగా కనిపించాయి. ముందస్తు ఆర్డర్లతో వ్యాపారులు బిజీబిజీగా మారారు.

ఇక మందుబాబుల హడావుడి విజయనగరంలో హద్దులు దాటింది. మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు తీరారు. పూటుగా తాగిన కుర్రకారు అర్ధరాత్రి దాటాక బైక్ రైడింగ్‌లతో వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఏదైనా ఈ హడావుడి ఈ ఒక్కరోజే. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జనం మనసుల్లో మెలిగే ఆశలు, ఆకాంక్షలు, కొత్తకొత్త ఆలోచనలు ఆచరణాత్మకం కావాలని, మంచి ఫలితాలను ఇవ్వాలని, ముఖ్యంగా పుట్టెడు సమస్యలతో సతమతమౌతున్న రైతులు, ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్లు,

ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో పయనించాలి



డిప్యూటీ సిఎం రాజన్నదొర

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలి. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలి. గతేడాది జిల్లా అభివృద్ధిలో మైలురాయి అయిన ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టాం. వచ్చే ఏడాది జిల్లా అభివృద్ధికి మరింత ఆశాజనకంగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నాం.

జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధించాలి



జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2024 నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలు, అశ్వర్యాలు పొందాలి. నూతన సంవత్సరం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడంలో మరింత ముందుకు సాగేందుకు దోహదం చేయాలి. ప్రతి ఒక్కరూ చక్కని ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి సాధించాలి. రక్త హీనత నివారణ వంటి అంశాలపై దృష్టి సారించాలి. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకరించి నూతన సంవత్సరంలో జిల్లా ప్రగతి దిశలో పయనించుటకు తోడ్పడాలి.

అభివృద్ధి బాటలో ఉమ్మడి జిల్లా

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లా పురోభివృద్ధిలో దూసుకుపోతున్నాయి జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిరస్థాయిగా నిలిపి ఉంచే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని చెప్పారు. ఇవన్నీ ఏళ్ల నుండి జిల్లా వాసులు కంటున్న కలను సాకారం చేస్తూ, ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి ప్రారంభించారని వెల్లడించారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి కేంద్ర మంత్రితో కలిసి సిఎం జగన్ శంకుస్థాపన చేయడం మరో మలుపని అన్నారు. ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాల్లో సుమారు రూ.3,500 కోట్లు అభివృద్ధి చేకూర్చినట్లు వివరించారు. జనవరి రెండో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మొదలు అవుతుందని వెల్లడించారు. పంట పొలాలకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి, తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం 516 ఇ, ఎన్‌హెచ్ 130సిడి జాతీయ రహదారుల నిర్మాణం జోరుగా సాగుతోందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా నిర్వహిస్తూ, వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు కెఎస్ శివరామరాజు, పి.శ్రీరాములు పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎం రాజన్నదొరతో చర్చిస్తున్న టిడ్కో చైర్మన ప్రసన్నకుమార్

జనవరి నెలాఖరులో టిడ్కో ఇళ్లు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

జనవరి నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు హక్కు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ చెప్పారు. ఆదివారం ఆయన డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిశారు. వచ్చేనెలాఖరి వారంలో లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాజన్నదొర టిడ్కో ఇళ్ల సముదాయానికి విద్యుత్ సరఫరాకు సంబంధించి చర్యలు తీసుకోవాలని సిఎంను కోరగా దీనికి అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. మొత్తం 1150మంది లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇళ్ల కోసం కట్టిన డిపాజిట్ల సొమ్ము రూ.67లక్షలను సంబంధిత లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అనకాపల్లిలోనూ టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఆ జిల్లా ఇంఛార్జి మంత్రిగా రాజన్నదొరను ఆహ్వానించినట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి - కొమరాడ

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చెందిన పలు రికార్డులను పరిశీలించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాలు ఎఒబి పోలీస్టేషన్లో ఎప్పుడు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే అంతర్ రాష్ట్ర రహదారులకు సంబంధించి వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రహదారులపై నుంచి నిషేధిత వస్తువులు అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ముఖ్యంగా గంజాయి, మద్యం వంటి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం విడిచిపెడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నాటు సారా నిర్మూలనకు ప్రజల నుంచి సహకారం అవసరమన్నారు. మద్యం, నాటు సారా అక్రమ అమ్మకాలపై పోలీసులకు ప్రజల్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, వివిధ పోలీసు అధికారులు ఉన్నారు.



కొమరాడలో రికార్డులను పరిశీలిస్తున్న డిఐజి హరికృష్ణ

సాలూరు రూరల్ : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ ఆదివారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. సంక్రాంతి, శంబర జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఎఎస్‌పి సునీల్ సేయోరెన్, రూరల్ ఎస్ఐ ప్రయోగ మూర్తి ఉన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం స్థానిక గిరిజన బాలికల వసతి గహ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రాజు, పండు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పండు మాట్లాడుతూ నేడు దేశంలో విద్యార్థుల సమస్యల కోసం పోరాడే సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. 1970లో కేరళలో డండం అనే ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని, అందరికీ విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఉపాధి అవకాశాలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం శూన్యమన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వారికి కారు చౌకగాఅమ్మేస్తున్నారు. విద్యార్థులకు నష్టం కలిగించే నూతన జాతీయ విద్యావిధా నాన్ని ఏ రాష్ట్రం అమలు చేయకుండానే మన రాష్ట్రం మాత్రం పూర్తిగా అమలు చేస్తుందని అన్నారు. దీన్ని తిప్పికొట్టాల న్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.భాస్కర్, శారద, దిలీప్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు రాజు

సాలూరు: ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బంగారమ్మ పేటలో ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి టి.అఖిల్ హాస్టల్ ఆవరణలో ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఆవిర్భవించి రెండేళ్లు కావస్తున్నా విద్య, ఉపాధి అవకాశాలు లేవన్నారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థి సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానంతో ప్రభుత్వ విద్యారం గానికి తీరని నష్టమని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వరుణ్, నితిన్ పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

సాలూరు : ఇంజనీరింగ్ పట్టభద్రులు, సాధారణ డిగ్రీ పట్టభద్రులైన యువకులు పర్పుల్ లేన్ సాఫ్ట్వేర్ శిక్షణ సంస్థ ద్వారా అందించే శిక్షణ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. ఆదివారం ఆయన నివాసంలో పర్పుల్ లేన్ సాఫ్ట్వేర్ శిక్షణ సంస్థ ప్రతినిధులు రాజన్నదొర చేతులు మీదుగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువకులు పర్పుల్ లేన్ శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని సూచించారు. ఐటిడిఎ పిఒలు, స్కిల్ డెవలప్మెంట్ సంస్థలు ఈ సంస్థ ద్వారా యువకులకు శిక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థ సిఇఒ కె.సంతోష్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు, కోడింగ్‌తో సంబంధం లేకుండా సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించవచ్చునని చెప్పారు. దీనికి సంబంధించిన శిక్షణ అందజేస్తుందని తెలిపారు. ఇప్పటికే భీమవరం ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, కాకినాడ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ కల్పించామని, వారు సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడ్డారని చెప్పారు. కార్యక్రమంలో కె.భవానీ ప్రసాద్, సంస్థ బ్రాంచ్ మేనేజర్ టి.సుమలత, డిజైనర్ హేమంత్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు త్వరలో పరిష్కారం

ప్రజాశక్తి - సాలూరు

అంగన్వాడీ చేపట్టిన సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన అంగన్వాడీల నిరసన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సేవలపై సిఎం మంచి అభిప్రాయంతోనే వున్నారని చెప్పారు. జీతాల పెంపుపై అధ్యయనం చేయడానికి ముగ్గురు మంత్రులతో కమిటీ నియమించారని తెలిపారు. ఈ కమిటీ త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఏం చేసిందో ప్రతిపక్ష నాయకులను అడగాలని సూచించారు. సచివాలయం సిబ్బందితో అంగన్వాడీ కేంద్రాలను నడిపించడం సరైన పద్ధతి కాదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.రాధ చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉద్యోగులు ఆట పాటలతో వినూత్నంగా నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దిగొచ్చి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, ఎ.అంజలి, ఎస్.ప్రియ, గౌతమి, అరుణకుమారి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల సమ్మె 20వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో అంగన్వాడీలు ఆట, పాటలు నిర్వహించి తమ పోరాటాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతి, శ్రామిక మహిళా నాయకులు బి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిచో జనవరి 3న పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ గౌరమ్మ, ఎం.సావిత్రి, జి.హైమావతి, టి.లక్ష్మి, అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీల సమ్మెలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో ఆటపాటలతో నిరసన తెలిపారు. సిఐటియు ఐక్యత, అంగన్వాడీలు అందిస్తున్న సేవలను పాట రూపంలో వినిపిస్తూ నృత్యాలు చేస్తూ తమ భావాన్ని బాధను ప్రభుత్వానికి వినిపించారు. కార్యక్రమంలో అంగన్వాడీల అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, కస్తూరి ఉన్నారు.

పాలకొండ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆటపాట, ముగ్గులు వేస్తూ నిరసన తెలిపారు. అంగన్వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, అంత వరకూ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. అలాగే ప్రజల మద్దతుతో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరవేణి, ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు జి.జెస్సీబాయి, ప్రతినిధులు జి.శారద, ఆర్.భవాని, ఎం.శ్యామల, శ్రీదేవి, సుగుణ, లలిత, నిర్మల తదితరులు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, యూనియన్ నాయకులు యశోద, సునీత, ఎస్.అరుణ, పి.పద్మ, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ. ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

కొమరాడ : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె ఆదివారం 20వ రోజు కొనసాగింది. సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు వాలీబాల్, కోలాటం ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనురాధ, పద్మ, మల్లేశ్వరమ్మ, జ్యోతి, జయమ్మ, లలిత, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

శిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ సిఎం



సాలూరులో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

బలిజిపేట : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. బలిజిపేటలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపి అంగన్వాడీ ఉద్యోగులకు ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బందుల్లోకి నెట్టడమే తప్ప వారికి న్యాయం చేసిన దాఖలాల్లేవన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణు వేణుగోపాల నాయుడు, సీనియర్ బి.సీతారాం, ఎస్.రాంబాబు, జి.బాబ్జీ, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అంగన్వాడీల జీవితాలతో చెలగాటం తగదు

పార్వతీపురంరూరల్ : చిన్నారులకు ఆటపాటలను నేర్పే అంగన్వాడీ కార్యకర్తల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పార్వతీపురం ప్రాజెక్టు నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీ మణి అన్నారు. కనీస వేతనాలు కల్పించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 20వ రోజు ఆదివారం, జీవితాలతో చెలగాటమాడవద్దని వినూత్న రీతిలో అంగన్వాడీ కార్యకర్తలు ఆటపాటలు ఆడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. సెక్టార్ లీడర్స్ కె.రాజేశ్వరి, ఎం.గౌరీ, బి.సునీత, విమల, కృష్ణవేణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో ఆటపాటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు





బలిజిపేటలో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర ; గరుగుబిల్లి కోలాటం ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్

నఖచిత్రాయణం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాకు చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు ఉత్తమ ఉపాధ్యాయులు పల్లా పరిశినాయుడు సంకలన పరిచిన నఖచిత్రాయణం పుస్తకం ఆవిష్కరణ ఆదివారం చిన్నబొండపల్లిలో జరిగిన కొప్పల వెలమ వన సమాదరణ కార్యక్రమంలో జరిగింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నవరత్నాల కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాజీ దత్తి లక్ష్మణరావు, భాస్కర విద్యా సంస్థల అధినేత చుక్క భాస్కరరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో మరణించిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబ సభ్యులతో జనవరి 3, 4 తేదీల్లో 30 గంటల పాటు జరుగుతున్న దీక్షల్లో మరణించిన బాధిత కుటుంబ సభ్యులతో పాటు అగ్రిగోల్డ్ బాధితులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మన సంఖ్యా బలం చూపించాల్సిన అవసరం ఉందని, కావున ప్రతి ఒక్కరూ ఆలోచించి మీరు, మీతో పాటు మీకు తెలిసిన వారికి కూడా తెలియజేసి, ఈనెల 3న విజయవాడ రావాలని కోరారు. మరణించిన వారి డెత్ సర్టిఫికెట్ జెరాక్స్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బాండ్ లేదా ఏజెంట్ ఐడి కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, మ్యాక్సీ సైజ్ ఫొటో, నామినీ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ , బ్యాంక్ పాస్ బుక్ నాలుగేసి సెట్లు తెచ్చి రాష్ట్ర కమిటీ వారికి ఇవ్వాలని తెలిపారు.

దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి - సీతానగరం

పార్వతీపురం మున్సిపాల్టీలో టిడిపి కౌన్సిలర్ కోరాడ నారాయణరావుపై వైసిపి కౌన్సిలర్లు దాడులు చేయడం దుర్మార్గమని టిడిపి మండల కార్యదర్శి రౌతు వేణుగోపాల నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైపిపి ప్రభుత్వం ప్రజలపై దాడులే కాకుండా ప్రశ్నించిన వారిపై కూడా భౌతిక దాడులు చేయడం రౌడీ రాజ్యంగా మారిందన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించేటప్పుడు సమస్యలను పరిష్కరించే దిశగా ఉండాలి తప్ప భౌతిక దాడులు చేయడం రాష్ట్ర చరిత్రలో లేదన్నారు. ఇటువంటి దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బి.శ్రీనివాసరావు, ఆర్.సింహాచలంనాయుడు, వి.గుంపస్వామి, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.జగన్నాథ నాయుడు, జె.గరికయ్య, ఎం.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లా నలుమూలల నుండి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. జెయింట్ వీల్ వద్ద పర్యాటకులు ఉయ్యాల ఊగారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. ఆల్ ట్రైన్ వెహికల్ ఎక్కి పార్క్ చుట్టుముట్టారు. సాహస క్రీడలతో చిన్నారులు పాల్గొన్నారు. మినీ ట్రైన్ ఎక్కి ఎంచక్కా ఆడుకున్నారు. చిన్నారులు మినీ బోటింగ్ చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

కోవిడ్‌పై అప్రమత్తం


ప్రజాశక్తి - సాలూరు

కోవిడ్ వైరస్ జెఎన్-1 రూపంలో కోరలు చేస్తున్న నేపథ్యంలో విద్యార్థులు విధిగా మాస్క్ ధరించాలని స్థానిక శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన విద్యార్థులు, యువకులకు కోవిడ్ వైరస్ జేఎన్-1పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గతంలో కోవిడ్ వైరస్ విజృంభణతో అనేకమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అలాంటి పరిస్థితి మళ్లీ తెచ్చుకోకండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాపుల అద్దెకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మెయిన్ రోడ్డులో కమ్యూనిటీ భవనం ఎదురుగా ఐటిడిఎ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన షాపులు అద్దెకు ఇవ్వనున్నట్టు పిఒ కల్పనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4లోగా దరఖాస్తులు గిరిజన అభ్యర్థుల నుంచి కోరుచున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రూ.4వేలు అద్దె చెల్లించి, లక్ష రూపాయలు డిపాజిట్ చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9392917692 సంప్రదించాలని కోరారు.



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని లుంబూరుకు చెందిన రౌతు రామలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేసిన రూ.2 లక్షల చెక్‌ను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్, వైస్ సర్పంచ్ పడాల రామచంద్రరావు, మాజీ సర్పంచ్ రౌతు వాసుదేవరావు, మాజీ ఎంపిటిసి ఎస్.అప్పారావు, రౌతు నారాయణరావు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద దిశా ఎస్ఐ లావణ్య దిశా యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో యాప్‌ను ఎలా ఉపయోగించాలన్నది తెలిపారు. మొబైల్లో యాప్ అప్లోడ్ చేశారు. మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు మహిళలకు పోలీసులు రక్షణగా ఉంటారని భరోసా ఇచ్చారు.

'బాబు షూరిటీ'తోనే అందరి అభివృద్ధి

ప్రజాశక్తి - బలిజిపేట

రాష్ట్రంలో అందరూ అభివృద్ధి కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్‌చంద్ర అన్నారు. బలిజిపేటలో మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికి షాపుల వద్దకు వెళ్లి ప్రచారంతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. ఆరు పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బి.సీతారాం, పి మోహన్‌రావు, ఎం.సూర్యనారాయణ, జి.సింహాచలం, బి.సింహాచలం, క్లస్టర్ ఇంచార్జ్ ఎస్.రాంబాబు, జి.బాబ్జీ, యూనిట్ బూత్ ఇన్చార్జులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న విజయచంద్ర

పత్తి రైతు దిగాలు...

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వాణిజ్య పంటల్లో ఒకటైన పత్తి పంటపై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస మండలాల్లో పత్తి పంట విస్తారంగా ఉంది. అయితే పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర దిగాలతో కనబడుతున్నారు. మిచాంగ్ తుఫాను ప్రభావంతో పలుచోట్ల పత్తి పంటకు కొద్దిపాటి నష్టం వాటిల్లినా మిగతా ప్రాంతాల్లో పత్తి దిగుబడి బాగా వచ్చింది. అయితే పత్తి పంట చేతికి వచ్చినా సరైన మద్దతు ధర లేక తక్కువ ధరకే అమ్ముకుని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది క్వింటా పత్తి రూ.7500 నుంచి రూ.8500 వరకు ధర ఉండేది. ఈ ఏడాది మాత్రం రూ.6200కు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు ధర చెప్పడంతో అమ్ముకోలేక, ఉండలేక రైతులు తీవ్ర సతమతం అవుతున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పత్తి పంట వేసినా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధర కరువు



ఏజెన్సీలో సాగువుతున్న పత్తి

గుమ్మలక్ష్మీ పురం మండలంలో 813 హెక్టార్లలో పత్తి పంట సాగైంది. తాటిశీల, ఇరిడి, పెద్దఖర్జ, పెద్దగూడ, ఎస్‌కె పాడు, దుడ్డుఖల్లు తదితర ప్రాంతాల్లో గిరిజన రైతులు పత్తి పండిస్తున్నారు. ఒక్కొక్క ఎకరానికి రూ.15వేలు చొప్పున పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అయితే మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. రైతు కష్టాలను గుర్తించి ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు రావాలని కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం..

పత్తి పంటకు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పెట్టిన పెట్టుబడికి, శ్రమకు ఫలితం లేకుండా పోతుంది. క్వింట పత్తి రూ.7500కు కొనుగోలు చేయాలి.

బిడ్డిక రాజారావు
గిరిజన రైతు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి...

గిరిజన రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. దళారులు రావడంతో పంటలకు మద్దతు ధర లేకుండా పోతుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.



ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులు, ఉద్యోగుల బకాయిల కోసం

3న కలెక్టరేట్ వద్ద ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 3న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. పిఆర్‌సి ఎరియర్స్, డిఎ బకాయిలు, పిఎఫ్ లోన్, ఎపిజిఎల్ఐ తదితర అంశాల మొత్తం సుమారు రూ.18 వేల కోట్లు ప్రభుత్వం నుండి బకాయిలున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఇళ్ల అవసరాలకు, ఆడపిల్లల పెళ్ళిళ్లు, మెడికల్ తదితర ఖర్చులకు పిఎఫ్‌లో దాచుకున్న డబ్బును కూడా ఇవ్వడంలేదని, ఇది చాలా దారుణని అన్నారు. ఈ బకాయిలు చెల్లించాలని ఈనెల 26,27 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించామని, అయినా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. దీంతో కలెక్టరేట్ వద్ద జనవరి 3న ధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ధర్నాకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.శంకర రావు, జనకేరావు, ఎన్.శ్రీనివాసరావు, పి.వెంకటనాయుదు, కె.కృ ష్ణారావు పాల్గున్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేపడుతున్న సందర్భంగా, ఆరో రోజు ఆదివారం పార్వతీపురంలో మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు సిఐటియు, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న సమ్మె శిబిరం నుంచి ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల కూడలి వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌వై నాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ శంకర్రావు మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందని, పోటీ కార్మికులను తీసుకొచ్చి, పనిముట్లు తెచ్చి, పని చేయించాలని చూస్తుందని, దీన్ని ప్రతిఘటిస్తున్న కార్మికులు, కార్మిక నాయకులపై, అరెస్టులు, కేసులు పెట్టి భయాందోళనకు గురిచేస్తున్నారని, దీన్ని యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కార్మికులు వర్గానికి సబ్బులు, నూనెలు, ఇవ్వమంటే డబ్బుల్లేవని చెప్పే పాలకవర్గం, ఉన్నఫలంగా పోటీ కార్మికులు, పనిముట్ల కోసం ఏ విధంగా నిధులు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని, చెత్తను ఊడ్చడమే కాదు, ప్రభుత్వ చేతగానితనాన్ని కూడా ప్రజల మధ్య పెట్టి దులిపి వేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ కమిటీ నాయకులు ఎం.శివ, మల్లేష్, సింహాచలం, గాంధీ, చిన్నమ్మలు, టి.వినయ్, నాగరాజు, అనిల్, తాతబాబు, క్రాంతి, కార్మికులు పాల్గొన్నారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదోరోజుకు చేరింది. ఆదివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు ప్రధాన రహదారిపై అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోలరాజు, టి.రవి పాల్గొన్నారు.



పార్వతీపురం పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

పాలకొండ : ప్రభుత్వానికి బుద్ధి రావాలని మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ఒంటి కాళ్లపై నిరసన ప్రదర్శన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ కమిటీ అధ్యక్షులు పడాల భాస్కరరావు ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు వై.హరిబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం అక్కస్సు వెలగకుతుందని, పోటీ కార్మికులు, పనిముట్లు తెచ్చి పని చేయించాలని చూస్తుందని, దీన్ని ప్రతిఘటిస్తున్న కార్మికులు, కార్మిక నాయకులపై, అరెస్టులు, కేసులు, పెట్టి భయాందోళనకు గురిచేస్తున్నారని, దీన్ని యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. తక్షణమే మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, సభ్యులు, నూనెలు, చెప్పులకు నిధులు కేటాయించాలని, చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, అంతవరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చింతల సంజీవి, పడాల వేణు, చింతల సురేష్, విమల, శ్రీదేవి, పి.సాయి, కె.రాజేష్, పి.సతీష్, టి.ఈశ్వర్‌కుమార్, జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్రంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవ డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులకు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆదివారం సిపిఐ కార్యవర్గ సభ్యులు కుండంగి లింగరాజు, గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమ్మె చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు మద్దతు తెలపడమే కాకుండా సంఘీభావంగా ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీలు 20 రోజులుగా అంగన్వాడీలు, మునిసిపల్ ఉద్యోగులు 5 రోజులుగా, సమగ్ర శిక్ష ఉద్యోగులు 11 రోజులుగా సమ్మె చేస్తున్నారని, వీరితో చర్చలు జరిపాల్సిన ప్రభుత్వం చర్చలు జరపకుండా మొండిగా వ్యవహరిస్తుందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడానికి సిద్ధ పడకపోవడం దుర్మార్గమని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులను బెదిరింపులకు పాల్పడి షోకాజ్ నోటీసులు ఇచ్చి క్రమశిక్షణ చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కార్మికులు, ఉద్యోగులు న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని, నిర్బంధాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు లక్ష్మణరావు, గిరిజన సంఘం నాయుకులు రమణ మూర్తి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు,.

హక్కుల రక్షణకు విస్తృత పోరాటాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆదివాసీ హక్కుల రక్షణ కోసం విస్తృతంగా పోరాటాలు చేయాలని సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్ రద్దు చేయడంతో జనాభా ప్రకారం సబ్ ప్రాన్ నిధులు వచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో గిరిజన సంక్షేమం, అభివృద్ధి లేకుండా పోయే ప్రమాదం వచ్చిందని దుయ్యబట్టారు. అటవీ సంరక్షణ చట్టం పేరుతో అడవి నుండి గిరిజనులను వెళ్లగొట్టేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిసిసి మాదిరిగానే ఐటిడిఎను నిర్వీర్యం చేసే ప్రయత్నం తీవ్రంగా జరుగుతున్న పరిస్థితిలో పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలని అన్నారు. రైతు కూలీ సంఘం అధ్యక్షులు వూయక ముత్యాలు మాట్లాడుతూ పోరాడే, కలిసివచ్చే శక్తులతో కలిసి పోరాటాలు ముందుకు తీసుకుపోవాలని అన్నారు. గిరిజన సమాఖ్య నాయకులు కుండంగి లింగరాజు, పువ్వుల ప్రసాద్ మాట్లాడుతూ ఎర్ర జెండా నీడలో గిరిజన పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు పోతుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు మాట్లాడుతూ గిరిజన విద్య, వైద్యం గిరిజనులందరికీ సక్రమంగా అందడం లేదని అన్నారు. గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పాలవలస భగవాన్ మాట్లాడుతూ పాలకులు నిత్యం గిరిజనులకు అన్యాయం చేస్తూనే ఉన్నారని అందరూ ఐక్యంగా ప్రశ్నించాలని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌ఓ నాయకులు సోమేశ్, గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంగం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు శ్రీనునాయుడు, భాస్కరరావు, సిపిఐ నాయకులు జీవ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సూరయ్య ,గిరిజన నిరుద్యోగ సంఘాల నాయకులు బి.జనార్దన్, చిన్నారావు, చందు, నాగార్జున, శ్రీను , తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ సంఘం సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న కోలక లక్ష్మణమూర్తి

కమిటీ ఎన్నిక

ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణ మూర్తి ని ఎన్నుకున్నారు. సభ్యులుగా పాలక రంజిత్ కుమార్, ఊయక ముత్యాలు, కుండంగి లింగరాజు, కద్రక నీలకంఠ, తాడంగి సాయిబాబు, బొండపల్లి జనార్దన్, పీడిక అసిరయ్య, కొండతామర సోమేశ్, గొర్లి భవానీ ప్రసాద్, దాసరి సూర్యం, కోలక కొండలరావు, పి.సంగం, హిమరక చిన్నారావు, పువ్వల ప్రసాద్ తదితరులను ఎన్నుకున్నారు.

మినీ రిజర్వాయర్ నిర్మించాలి

ప్రజాశక్తి కొమరాడ

గిరిజనులకు సాగునీరందించేందుకు మినీ రిజర్వాయర్ డ్యామును నిర్మించాలని సిపిఎం నాయకులు కొల్లి సామామూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని చినఖేర్జల- రేగులపాడు గ్రామాల మధ్య వనకాబడి గెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మించి పంట పొలాలకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు డ్యామ్ ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. రేగులపాడు, బంజుకుప్ప, బూర్జివలస, లింగన్నదొర వలస, కోటిపాం గ్రామాలకు సంబంధించిన సుమారు 1500 ఎకరాలకు సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం, ఐటిడిఎ రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని చెప్పి ఇప్పుడు ఆ దిశగా కేవలం అది చిన్న వనకాబడిగెడ్డపై రూ.2కోట్లు ఖర్చుపెడితే సుమారు 1500 ఎకరాలకు నీరందించే పరిస్థితి ఉందని తెలిపారు. ఇక్కడ మినీ రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి కొంతవరకు మెటీరియల్ వేసినప్పుడు కూడా ఇంతవరకు ఆ పని పూర్తిగా చేయకపోగా ఆ వైపు కనీసం అధికారులు చూడని పరిస్థితి ఉందని అన్నారు. కావున వెంటనే అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు ఐటిడిఎ అధికారులు స్పందించి ఈ గ్రామాల మధ్య వనకాబడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మించి పైన తెలిపిన గ్రామాల్లో గల రైతులు భూములకు సాగునీరందించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

మోహన్ కుటుంబానికి ఆర్థిక సాయం


ప్రజాశక్తి -వీరఘట్టం

భామిని మండలానికి చెందిన అల్లు మోహన్ ఇటువంటి ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం మండలంలోని వండవలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వి.కళావతి సిఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షలు చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో భామిని గ్రామస్తులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరామ్మూర్తి మాస్టారును గుమ్మలక్ష్మీ పురం పెద్దలు సన్మానించారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా గిరిజన ప్రాంతంలో సేవలు విస్తృతం చేసిన సందర్భంగా సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కన్వీనర్ పైడా కొండలరావు, రెడ్‌క్రాస్ బాధ్యులు గుడ్ల హరిప్రసాదరావు, మద్ది దొరబాబు, భద్రగిరి బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్, పెద్దలు పాల్గొన్నారు.



మంచిపల్లి శ్రీరామ్మూర్తిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

తూర్పు కాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా మన్మథరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గం ఎపి తూర్పు కాపు సంక్షేమ సంఘ అధ్యక్షునిగా కొనిశ మన్మథరావును నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగా ఎన్నికైన మన్మథరావుకు ఏజెన్సీ తూర్పు కాపు సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని, నియోజకవర్గంలో తూర్పు కాపులకు ఎల్లవేళలా అండగా ఉంటూ రాజకీయంగా, ఆర్థికంగా సమాజంలో తూర్పు కాపులను మరింత అభివృద్ధి పథంలో నడపడానికి కృషి చేస్తానని తెలిపారు.

హోలీ క్రాస్ ప్రాంతీయ శిఖరాగ్ర సమావేశం

ప్రజాశక్తి -భామిని

హెూలీ క్రాస్ సంస్థ ద్వారా మండలంలో నిర్వహిస్తున్న 130 మంది గ్లో క్లబ్ చెందిన బాలికలతో ప్రాంతీయ శిఖరాగ్ర సమావేశం మండలంలోని కారిగూడతోటలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలికలకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించి, వారి శక్తి వెలికితీసే పలు కార్యక్రమాలు నిర్వహించారు. హెూలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభు దాస్ మాట్లాడుతూ, ప్రతి ఏటా ఒక బాలిక పాఠశాలకు వెళితే ఆమె భవిష్యత్తు ఆదాయాన్ని 10 శాతం పెంచుకోవచ్చని, బాలికల విద్య మెరుగైన ఆరోగ్య ఫలితాలతో ముడిపడి ఉందని, బాలికలు విద్యావంతులుగా ఉండేలా చూసుకోవడం సమాజం బాధ్యత అని అన్నారు. వారికి అవసరమైన జ్ఞానంతో బాలికలను శక్తివంతం చేసే సామర్థ్యం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎపిసి శ్రీవిద్య, మెంటార్స్ సంతోషి, సత్యవతి, మాధవి, కావ్య, రిమాలి, భవాని, సుకన్య, పుణ్యవతి, మౌనిక పాల్గొన్నారు. ఈ సమావేశానికి 130 మంది గ్లో క్లబ్ బాలికలు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస గ్రామ సమీపంలో 1997 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు కలయికతో పండగ వాతావరణ నెలకొంది. ఎక్కడెక్కడో వివిధ స్థాయిల్లో ఉద్యోగులు చేస్తూ కుటుంబ సమేతంగా వచ్చి ఎక్కడున్నారు ఏం చేస్తున్నారని ఒకరికొకరు పలకరించుకొని రోజంతా సరదాగా గడిపారు. వీరి కలయికతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణంలా ఉంది. కార్యక్రమంలో వారాడ ప్రవీణ, మాచర్ల అనిల్‌బాబు, తూముల మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అర్తాం రైల్వే గేట్ వద్ద పార్వతీపురం నుంచి ఒడిశా వైపు వెళ్తున్న కర్రల లోడుతో వెళ్తున్న లారీ పైనుంచి కర్రలు పక్కనే వెళ్తున్న వ్యక్తిపై పడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయలైన వ్యక్తి శివినికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వెంటనే స్థానికులు సహాయంతో గాయాలైన వ్యక్తిని పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. ఒడిశాలోని జెకె పేపర్ మిల్లుకు వెళ్లే లారీలు ఓవర్ లోడుతో వెళ్లడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. మితిమీరిన లోడ్లు కర్రలు కట్టడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద గోతుల వద్ద కర్రలు పడిపోవడంతో ఆ సమయంలో వెనుక పక్కనున్న వాహనాలపై కర్రలు పడిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు మండలంలో అనేకర చోటు చేసుకున్నా వాహనదారుల తీరు మాత్రం మారడం లేదు. రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులు స్థానిక పోలీసులు ఇప్పటికైనా స్పందించి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న కర్రల లారీపై చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.